తల్లిదండ్రుల చెంతకు అదృశ్యమైన నలుగురు బాలురు

బాలురను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

గోల్నాక, ఫిబ్రవరి 21: అంబర్‌పేటలో అదృశ్యమైన నలుగురు బాలుర అచూకీ లభించింది. అంబర్‌పేట పేమ్‌నగర్‌కు చెందిన తేజ్‌నాథ్‌రెడ్డి (13), నితీష్‌చౌదరి (13), కె.హర్షవర్ధన్(13), మహ్మద్ అజ్మత్(13) ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. వీరు గత గురువారం కనిపించకుండాపోయిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా ఎట్టకేలకు వీరంతా యాదగిరిగుట్టలో బంధువుల వద్ద ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అంబర్‌పేట పోలీసులు శుక్రవారం యాదగిరిగుట్టకు వెళ్లి విద్యార్థులను అంబర్‌పేటకు తీసుకువచ్చి తల్లిదండులకు అప్పగించారు.

రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన

బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డి శుక్రవారం మీసేవా కేంద్రానికి వెళ్లి రేషన్ కార్డుల దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తుదారులకు కలుగుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. – అంబర్‌పేట, ఫిబ్రవరి 21

కాంట్రాక్ట్ ఉద్యోగులకు టైంస్కేల్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 21 : తెలంగాణ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు టైం స్కేల్ ఇచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ విశ్వ విద్యాలయాల నాన్‌టీచింగ్ కాంట్రాక్ ఉద్యోగుల ఎంప్లాయీస్ అసోసియేషన్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగులకు టైంస్కేల్ న్యాయబద్ధమైన డిమాండ్ అని ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లే విధంగా తన వంతు కృషిచేస్తానన్నారు. ఉద్యోగుల తమ న్యాయమైన సమస్యలను సామాజిక కోణంలో ప్రభుత్వం దృష్టికి తీసుకుళ్ళి పరిష్కరించే విధంగా ప్రయత్నం చేసినప్పుడే సత్ఫలితాలు ఉంటాయని ఆయన సూచించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ప్రపంచ బ్యాంక్ ఆదేశాల మేరకు కాంట్రాక్టు విధానాన్ని తీసుకువచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్టారెడ్డి, వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం, నాన్‌టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల ఎంప్లాయీస్ చైర్మన్ సూర్య చంద్ర, వైస్ చైర్మన్ ఎం.మన్ మోహన్, శ్రీనివాస్, కొత్త వెంకటేశ్, డా.విష్ణువర్ధన్,కే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర శర్మ గొప్ప విద్వాంసుడు

ప్రముఖ సంస్కృత విద్వాంసులు డాక్టర్ ప్రభాకర శర్మను సత్కరించిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21: సంస్కృత వాంగ్మయ ప్రాచుర్యానికి జీవితాన్ని అంకితం చేసిన దోర్బల ప్రభాకర శర్మ గొప్ప విద్వాంసుడని వక్తలు కొనియాడారు. తెలంగాణ సారస్వత పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ప్రపంచ మాతృభాష దినోత్సవ సందర్భంగా శుక్రవారం సాయంత్రం జరిగిన సభలో ప్రభాకర శర్మకు వేదాలంకార డాక్టర్ ముదిగంటి గోపాలరెడ్డి సంస్కృత పండిత పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత జరిగిన ఈ సభలో ప్రభాకర శర్మకు పురస్కారం కింద రూ.25 వేల నగదు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. దోర్బల తెలంగాణలో పండిత కుటుంబంలో జన్మించి కొవ్వూరులో సంస్కృత కళాశాలలో ఆచార్యులుగా, ప్రధానాచార్యులుగా సేవలందించి జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సముపార్జించారని శివారెడ్డి అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న సంస్కృత అకాడమీ సంచాలకులు డాక్టర్ పెన్నా మధుసూదన్ ప్రసంగిస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత శాఖ ఆచార్యులుగా, శాఖ అధ్యక్షులుగా పలు పరిశోధనా గ్రంథాల కర్తగా ముదిగంటి గోపాల్ రెడ్డి చిరస్మరణీయులని, ఆయన పేరుతో నెలకొల్పిన పురస్కారాన్ని మరో గొప్ప పండితుడైన ప్రభాకర శర్మకు ప్రదానం చేయడం సముచితంగా ఉందని అన్నారు. ఈ పురస్కారానికి నిధిని ఏర్పాటుచేసిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి మాట్లాడుతూ.. గోపాల రెడ్డి సంస్కృత పండితునిగానే కాకుండా బహుభాషా వేత్తగా విశిష్ట సేవలు అందించారని తెలిపారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య స్వాగత ఉపన్యాసం చేశారు.

బీసీ మహిళలకు 50 శాతం సబ్ కోటా కల్పించాలి

కాచిగూడ, ఫిబ్రవరి 21: చట్ట సభలలో మహిళలకు 33% రిజర్వేషన్లు పార్లమెంటులో ఆమోదం పొందిన బిల్లులో బీసీ మహిళలకు 50 శాతం సబ్ కోటాను కల్పించాలని రాజ్యసభ సభ్యుడు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కాచిగూడ లోని అభినందన హోటల్లో శుక్రవారం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జయంతి గౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ బీసీ మహిళల సబ్ కోటాకు రాజ్యాంగబద్ధమైన రక్షణ కల్పించాలని కోరుతూ మార్చి 18, 19వ తేదీలలో ఢిల్లీలో జాతీయ బీసీ మహిళా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రానున్న పార్లమెంటు సమావేశాలు బీసీ మహిళలకు సంబంధించిన సబ్ కోటాను ప్రవేశపెట్టి ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీంతో వెనుకబడిన బీసీ మహిళలకు రాజకీయాల్లో మరింత ప్రాతినిధ్యం పెరగడంతో పాటు రాజ్యాధికారం లోనూ వాటా దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జసత్యం, జ్ఞానేశ్వర్, నందగోపాల్, సుధాకర్, ఉదయనేత, వంశీకృష్ణ, అనూరాధ, సునీత, ప్రణీత, శ్రీనివాస్, స్వరూప, భాగ్యలక్ష్మి, జ్యోతి, ప్రమోద, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య, కన్వీనర్ గుజ్జ కృష్ణ

లిఫ్ట్‌లో ఇరుక్కున్న బాలుడు.. కాపాడిన 108 సిబ్బంది

మెహిదీపట్నం ఫిబ్రవరి 21 : లిఫ్ట్‌లో ఇరుక్కున్న బాలుడిని 108 సిబ్బంది కాపాడిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది.మాసాబ్ ట్యాంక్ శాంతినగర్ లోని హాకీ గ్రౌండ్ ఎదురుగా ఉన్న మఫర్ అపార్ట్‌మెంట్ లిఫ్టులో అర్నవ్ అనే ఐదు సంవత్సరాల బాలుడు ఇరుక్కున్నాడు. స్థానికులు సమాచారం అందించడంతో నాంపల్లి ఎమ్మెల్యే మమ్మద్ మజీద్ హుస్సేన్ అక్కడికి చేరుకుని పోలీసుల సహకారంతో 108 కి సమాచారం అందించారు. 108 ఈఎంటీ తజుద్దీన్, పైలెట్ సురేశ్ బాలుడిని లిఫ్టులో నుంచి తీసుకుని సీపీఆర్ చేస్తూ నీలోఫర్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ డాక్టర్లు మెరుగైన వైద్యం అందించి బాలుడి ప్రాణాలను కాపాడారు. 108 సిబ్బందిని, డాక్టర్లను ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అభినందించారు

మాతృభాషను నిర్లక్ష్యం చేయరాదు

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంలో పాల్గొన్న వక్తలు

అబిడ్స్, ఫిబ్రవరి 21 : మాతృభాష వల్ల విజ్ఞానము వస్తుందని , పూర్వ సంస్కృతి సంప్రదాయాలు అవగాహనకు వస్తాయని తెలంగాణ హైయర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సెమినార్ హాల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మాతృభాష తల్లితో సమానమని పసికందుకు తల్లి పాలు ఎంత ముఖ్యమో విద్యార్థులకు మాతృభాష అంతే అవసరమని, ఆంగ్ల భాషను నేర్చుకోవాలి కానీ మన మాతృభాషను నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. ప్రపంచ భాషలలో మాతృభాష గొప్పదని అన్నారు. జాతీయ పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి మండలి సలహాదారులు మరియు ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కోమటిరెడ్డి వెంకట్రెడ్డి మాట్లాడుతూ.. భాష సంస్కృతులు ఒక సమాజపు ఆర్థిక పురోగి పురోభివృద్ధిని ప్రభావితం చేయగలరని ఒక జాతి సాంస్కృతికంగా పురోగతి సాధించాలంటే ప్రథమ భాషే కీలక పాత్ర అని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయన్ ముదిరాజ్ మాట్లాడుతూ.. 40 సంవత్సరాలుగా ప్రజా సంక్షేమ అభివృద్ధి కొరకు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభు, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ డైరెక్టర్ లైన్ ప్రేమ్‌చంద్ మునోట్ జైన్, డాక్టర్ రవితేజ, యాస్మిన్ కౌసర్, బత్తుల హేమంత్, కళాశాల పీఆర్ఓ శ్రీకాంత్, ఎం లింగమూర్తితో పాటు పి. సమృద్ధి, ఆర్ వైష్ణవి, ఏ సృజన తో పాటు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధిపతి ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ, హైదరాబాద్ యూనివర్సిటీ సంస్కృత విభాగం అధిపతి ప్రొఫెసర్ అంబ కులకర్ణి, ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ హిందీ శాఖ అధిపతి ప్రొఫెసర్ రేఖా రాణి, మౌలానా అబ్దుల్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఉర్దూ శాఖ అధిపతి ప్రొఫెసర్ అబ్దుల్ కలాంకు లాంగ్వేజ్ ప్రొఫెషనల్ ఎక్సలెన్సీ అవార్డు 2025ను శాలువా మెమెంటో పూలదండతో పాటు ప్రశంసా పత్రంతో సన్మానించి, అభినందనలు తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన కృష్ణ గౌడ్

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కృష్ణ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు.
– మెహిదీపట్నం ఫిబ్రవరి 21

కులగణన రీ సర్వేపై విస్తృత ప్రచారం చేయాలి

కాచిగూడ, ఫిబ్రవరి 21: తెలంగాణలో నిర్వహిస్తున్న సమగ్ర కులగణన రీ సర్వేపై ప్రభుత్వం విస్తృత ప్రచారం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇంటింటికీ కులగణన రీ సర్వేపై ప్రజలకు సరైన అవగాహన కల్పించకపోవడం వల్లనే స్పందన కరువైందని, అందుకు నాలుగు రోజులుగా నమోదైన వివరాలే ఇందుకు నిదర్శనమని మండిపడ్డారు. నవంబర్లో నిర్వహించిన ఇంటింటి సర్వేలో దాదాపు 3.54 కోట్ల మంది పాల్గొనగా అందులో 16 లక్షల మంది సర్వేకు దూరంగా ఉన్నారని, ఆ సర్వేలో నమోదు చేసుకోని వారికోసం ఈనెల 16న నుంచి 28 వరకు రీ సర్వే చేపట్టిందని, గురువారం వరకు 4,625 కుటుంబాలు మాత్రమే రీ సర్వేలో పాల్గొని వివరాలు నమోదు చేసుకున్నారని అన్నారు. ప్రచారం లేకపోవడం వల్లే ప్రజలు పాల్గొనడానికి ఇష్టపడుతలేరని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన డిమాండ్ రీ సర్వే నమోదు చేసుకోవడానికి టోల్ ఫ్రీ నంబర్‌ను ముమ్మరంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వేముల రామకృష్ణ జిల్లపల్లి అంజి, అనంతయ్య పాల్గొన్నారు

కెనరా బ్యాంక్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

బ్యాంకు సిబ్బందిని క్రమబద్ధీకరించాలని వారంలో ఐదు రోజులే పని దినాలు చేయాలని కోరుతూ నారాయణగూడ కెనరా బ్యాంక్ ముందు గురువారం ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు రాంబాబు రవీంద్రనాథ్ లింగారెడ్డి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.
– అబిడ్స్, ఫిబ్రవరి 21

ట్రేడ్ యూనియన్ మహాసభలను విజయవంతం చేయాలి

రవీంద్రభారతి, ఫిబ్రవరి21: తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ కార్మికుల ట్రేడ్ యూనియన్ 5వ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ కుకింగ్ గ్యాస్ వర్కర్స్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీసీజీడీడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ మహాసభలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ సభలను కార్మికులు పెద్ద ఎత్తున విచ్చేసి విజయవంతం చేయాలన్నారు. గ్యాస్ డెలివరీ వర్కర్స్‌కు ప్రభుత్వం రాయితీలను కల్పించాలని, ఇందిరమ్మ ఇండ్లు, తెల్లరేషన్ కార్డులను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. చామకూర రాజు, కెవిగౌడ్, గోరే శ్యామ్ సుందర్‌గౌడ్, బుర్ర చంద్రయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

సంగీత నాట్య కళా సమ్మేళనంలో పాల్గొన్న కళాకారిణులను సత్కరించిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21: దర్శకుడు విశ్వనాథ్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని వక్తలు పేర్కొన్నారు. విశ్వఆర్ట్స్ ఆధ్వర్యంలో పద్మశ్రీ, దాదాసాహెబ్‌పాల్కే పురస్కార గ్రహీత, దర్శకులు, నటుడు, రచయిత డాక్టర్ కె. విశ్వనాథ్ 96వ జయంతి వేడుకలు అబిడ్స్‌లో ని తెలంగా ణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విశ్వ వరల్డ్‌రికార్డ్‌లో నమోదుకై సంగీత నాట్య కళాసమ్మేళనం పేరిట నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వివిధ రంగాలలో విశేష సేవలందిస్తున్న పలువురినీ సత్కరించారు. ఆర్. కె. కళా ఫౌండేషన్ అధ్యక్షుడు రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో రాజేంద్ర, లయన్ సామ్రాట్ నేత, బిక్కునాథ్‌నాయక్, మూస అలీఖాన్, మాదా ల నాగూర్, డా. నాని, డాక్టర్ వీరభోగవసంత రాయలు, చందు ఆంజనేయులు, దైదా పద్మారెడ్డి, దాసరి ప్రవీణ్, రాఘవ, గురువులు శ్రీవల్లి శర్మ, వాణి కులకర్ని, కల్పన, పట్టపు గోపి కృష్ణనాయుడు, వినోద్ కుమార్ ఆకుల, రవికుమార్, కృష్ణమూర్తి తదితరులు పా ల్గొన్నారు.

తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు ఘన సత్కారం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా ఇటీవల నియమితులైన, రంగస్థల కళల శాఖ పూర్వ విద్యార్థి ఆచార్య కోట్ల హనుమంతరావుకు అభినందన సభ వర్సిటీ ఆడిటోరియంలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఘనంగా నిర్వహించారు. హనుమంతరావు రంగస్థల కళా రంగానికి చేస్తున్న కృషిని ప్రశంసించారు.
– తెలుగు యూనివర్సిటీ

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వాహనదారులు ట్రాఫిక్ నిబంధన పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఏ. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ట్రాఫిక్ సిఐ ఆధ్వర్యంలో త్రీ, ఫోర్ వీలర్ వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అధిక సౌండ్ బాక్స్ కలిగిన వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ త్రి, ఫోర్ వీలర్ వాహనాలకు పరిమితి కి మించి సౌండ్ బాక్స్ ఉండరాదని ఆయన సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ అనిల్ గౌడ్, సిబ్బంది .
– కాచిగూడ, ఫిబ్రవరి 21

కారు దొంగ అరెస్టు

మెహిదీపట్నం ఫిబ్రవరి 21 : కారును దొంగిలించి తప్పించుకు తిరుగుతున్న దొంగను ఆసిఫ్‌నగర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు.అతని వద్ద నుంచి కారును స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పా టు చేసిన సమావేశంలో ఏసీపీ విజయ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు అడిషనల్ ఇన్స్పెక్టర్ రఘునాథ్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. మెహిదీపట్నం ఎమ్ఐ జీహెచ్‌కాలనీలో నివసించే షేక్ అబ్రా ర్(25) వద్ద మహబూబ్‌నగర్ మూసాపేట్ బీసీ కాలనీలో నివసించే ఆసిఫ్ (25)కారును అద్దెకు తీసుకున్నాడు. జల్సాలకు అ లవాటు పడ్డ ఆసిఫ్ అద్దెకు తీసుకున్న కా రును ఇతరులకు మార్ట్ గేజ్ చేసి డబ్బులు తీసుకుని తప్పించుకొని తిరుగుతుండడం తో అనుమానం వచ్చిన అబ్రర్ పోలీసుల కు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఆసిఫ్‌ని పట్టుకొని కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఏటీఎం ధ్వంసం చేసి చోరీకి ప్రయత్నించి..

చాంద్రాయణగుట్ట ఫిబ్రవరి 21 : ఆన్లైన్ గేమ్లలో జూదానికి బానిసగా మారి అప్పుల పాలైన ఓ వ్యక్తి దొంగగా మారి ఏటీఎం మెషిన్ను ధ్వంసం చేసి డబ్బులు దోచుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. సీసీ పుటేజీల ఆధారంగా శుక్రవారం మొగల్పురా పోలీసులు ఏటీఎం మిషన్ ధ్వంసం చేసిన దొంగను పట్టుకున్నారు. మొగల్పుర పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. అలియాబాద్‌కు చెందిన కాశీనాథ్ అలియాస్ కాశీ 24 పానీపూరి బండిని నిర్వహిస్తూ జీవితం కొనసాగిస్తున్నాడు. ఇతడు ఆన్‌లైన్‌లో జూదానికి అలవాటు పడి రూ. 30 లక్షలు అప్పులు చేశాడు. ఈ అప్పులను తీర్చడానికి ఏటీఎం కేంద్రాన్ని దోచాలని అనుకున్నాడు. 15వ తేదీ రాత్రి మొఘల్ పుర ప్రాంతంలోని ఎస్బీఐ ఏటీఎం కేంద్రంలోకి తెల్లవారుజామున వెళ్ళాడు. అక్కడ ఏటీఎం మెషీన్ ను ధ్వంసం చేసి డబ్బులు దొంగిలించడానికి విఫల ప్రయత్నం చేశాడు. సుమారు రెండు గంటలు ప్రయత్నించిన డబ్బులు దొంగిలించలేకపోయాడు. ఉదయం బ్యాంకుకు వచ్చిన మేనేజర్ రఫీ ఏటీఎం దొంగతనం గురించి గమనించి మొఘల్పుర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టిన డీఐ శ్రీను సీసీ పుటేజీల ఆధారంగా దొంగతనానికి ప్రయత్నించిన కాశీనాథ్‌ను శుక్రవారం ఉదయం మొగల్పురపు ప్రాంతంలో పట్టుకున్నారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి

బేగంబజార్ విద్యుత్తు డీఈ కి వినతిపత్రం సమర్పిస్తున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్ కుమార్ గౌడ్

అబిడ్స్, ఫిబ్రవరి 21 : వేసవి కాలం నేపథ్యంలో విద్యుత్ అంతరాయాలు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్ కుమార్ గౌడ్ బేగంబజార్ డివిజనల్ ఇంజనీర్‌ని కోరారు. శుక్రవారం ఆయన బేగంబజార్ డివిజనల్ ఇంజనీర్ రహత్ అలీని కలిసి వేసవి కాలంలో విద్యార్థులకు పరీక్షల సమయం అయినందున విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీంతో బేగంబజార్ విద్యుత్ విభాగం డీఈ ఫరహత్ అలీ సానుకూలంగా స్పందించి వేసవిలో విద్యుత్ అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ బీఆర్ఎస్ మహిళా నాయకురాలు ప్రియాగుప్తా, జాంబాగ్ డివిజన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు అహ్మద్, నాయకులు నరేశ్ గౌడ్, భజన్ సింగ్, ఆశ్రఫ్, డల్లు బాయ్ పాల్గొన్నారు.

స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

బాపు నగర్ లో డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్

గోల్నాక , ఫిబ్రవరి 21 : స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన బాపునగర్, న్యూ పటేల్ నగర్, నరేంద్ర నగర్ ప్రాంతాల్లో పర్యటించి, పాడైపోయిన మ్యాన్ హోల్స్ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రదీప్ కుమార్,వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కన్నం జాకీ బాబు, మహేశ్ ముదిరాజ్, స్థానిక బస్తీ నాయకులు పాల్గొన్నారు.

రేపు అజరామరం నాటక ప్రదర్శన

కాచిగూడ, ఫిబ్రవరి 21: తెలంగాణ సంగీత నాటక అకాడమీ, తెలంగాణ సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ లో అజరామమారం నాటక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కవి రాహుల్ తెలిపారు. శుక్రవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ ముఖ్య అతిథితులుగా తె లంగాణ సంగీత నాటక అకాడమీ చైర్పర్సన్ ఆచార్య అలేఖ్య పుంజాల, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నమోదు బాలాచారి తదితరులు హాజరవుతారని తెలిపారు.

ప్రజలు విద్యుత్ బకాయిలు చెల్లించాలి

మెహిదీపట్నం : ప్రజలు విద్యుత్ బకాయిల ను చెల్లించాలని విద్యుత్ సెంట్రల్ ఎస్ఈ వెంకన్న సూచించారు. శుక్రవారం మెహిదీపట్నం డివిజన్లోని పలు ప్రాంతాలలో పర్యటించి మొండిబకాయిల వసూళ్లకు చర్యలు చేపట్టారు. సుధీర్, ఏఈ కటారియా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానగర్ లంకలో దోమలు విజృంభణ

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాచిగూడ, ఫిబ్రవరి 21: టీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో తుల సిరామ్ నగర్ (లంక), కృష్ణానగర్, శాస్త్రినగర్, తదితర బస్తీలలో గత రెండు నెలలుగా దోమలు విజృంభిస్తున్నా సంబంధిత అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరించడంతో ప్రతిరోజూ ప్రజలకు నిద్ర ఉండడం లేదని బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్ ముదిరాజ్, అంజయ్య చారి ఆరోపించారు. శుక్రవారం లంకలో విలేకరులతో వారు మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాల్సిన సిబ్బంది వారానికి ఒకరోజు మాత్రమే ఫాగింగ్ చేస్తుండటంతో ప్రజలు రాత్రి వేళల్లో ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దోమల ఫాగింగ్ ఎంటమాలజీ విభాగం అధికారులు ప్రతిరోజూ అందుబాటులో ఉండటం లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం ఫిబ్రవరి 21: విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్ నగర్ సబ్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ స